# పదబంభరం

సీరియస్‌గా పాఠం చెబుతున్నాడు ఆచార్య. విద్యార్థినీ విద్యార్థులంతా రస నిమగ్నులై పాఠం వింటున్నారు. ఎందుకు వినరు? చెబుతున్నది వరూధిని వలపాయె! ప్రవరుడిపై వరూధిని ఎలా కన్ను వేసింది, ఆ కన్ను ఎలా ఆమె గుండె లోతుల్లో వలపుని నాటిందీ వివరంగా చెబుతున్నాడాయె! అందాల హరివిల్లు లాటి వరూధీని. అసలే కుర్రకారు. కథవలపు హెూరు. చెబుతున్నది మాంచి షసందైన జోరు. పద్యాన్ని రాగచ్ఛాయతో స్పష్టంగా మృదు మధురమైన కంఠంతో చెబుతున్నారు. పశువులు, శిశువులు, పాములు కూడా సంగీతానికి తల ఆడించవలసిందే!

రసభంగం చేస్తూ వచ్చాడు అటెండర్. తన ధోరణిలో ఆచార్య గమనించనే లేదు.

"సర్!" ఎవరో విద్యార్థి లేచాడు.

"ఏమిటి, సుందరశాయి! సందేహమా?

"ఏం లేదు, సర్! జయకర్ వచ్చాడు." చప్పునగది తలుపు వైపు చూశాడు. "లోపలికి రా!

అతను దగ్గరగా వచ్చి "సర్! మీకు ఫోన్" అన్నాడు.

ఆచార్య ముఖంలో ప్రశ్నార్థకం కనిపించింది.

"అర్జంట్ట! ఎవరో ఆడవాళ్ళు..." విద్యార్థినీ విద్యార్థులకి వినిపించకుండా చెప్పాడు. ఆచార్య ముఖంలో ఆశ్చర్యార్థకం! తనకి కాలేజీకి ఫోన్ చేసే దెవరబ్బ అనుకున్నాడు. అంతా క్షణంలోనే

విద్యార్థులవైపు తిరిగి 'క్షణంలో వస్తాను' అని కదిలాడు.

ఆయ నటు కదలగానే క్లాస్ రూమ్ కడలి తరంగం అయింది.

✧ ✧ ✧

"హలో!" అటూ ఇటూ చూసి హాంగ్ అవుతున్న ఫోనందుకుని అన్నాడు.

"మీ చుట్టూ ఎవరూ లేరా?" ఏదో తీయదనాన్ని ఎదలోనించి నేరుగా రసనాగ్రం ద్వారా ఫోన్ ఆ చివర పలికించిందా అమ్మాయి.

గుండె ఝల్లనిపించే తీయదనం. చప్పున అటూ ఇటూ చూశాడు. ప్రిన్సిపాల్ గారు ఏవో పేపర్సు చూస్తున్నారు. గదిలో ఇంకెవరూ లేరు. ఇటు చూస్తే కిటికీలోంచి విశాలమైన బయలు.

"ప్రిన్సిపాల్ ఒక్కరేనా?"

"ఆఁ" అప్రయత్నంగా అన్నాడు"

"ఆచార్యా! వరూధిని ఎలా ఉంటుంది?"

ఆ కంఠంలో వలపు పచ్చిదనంతో పాటు కొంటె దనం కూడా తొంగి చూసింది.

"ఎవరూ మీరు?"

"ఆ విషయం తెలిస్తే ఇంకేముంది? కోహం అనేదానికి అర్థం తెలీకే పద్దెనిమిది పురాణాలు, నాలుగు వేదాలు, పన్నెండు ఉపనిషత్తులు, గీత ఇంకా ఇంకా తరిచి చూస్తున్నారు మీరు. ఆంధ్రా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ పైగా అలాంటి మీకే తెలీనిది- ఒక అర్భకురాలిని నాకు నే నెవరో అంత సులువుగా తెలుస్తుందా?"

ఆచార్యకి ఆమె కొంటెదనం అర్థమైంది.

అంతలో బెల్ అయింది. క్లాసుల్లోంచి పిల్లలు బయటికి వస్తున్న సవ్వడి, టపాసులు పేలేంత శబ్దం. ప్రిన్సిపాల్ గారు క్లాసుకు బయల్దేరారు. ఆయన ఫోన్ చేస్తున్న ఆచార్యని గమనించనేలేదు. 'ఫామిలీ టాక్' అనుకున్నాడాయన.

"ప్రిన్సిపాల్ గారు క్లాసు కెళ్ళారా?"

"మీకు దివ్యదృష్టి ఉందా?"

"ఆఁ దృష్టి ఉంది, దివ్యత్వం ఉంది."

"ఇంతకీ ఫోనెందుకు చేశారు?"

"ఏమిటండీ ఈ ప్రశ్న! ఫోనెందుకు చేస్తారో తెలీదా? ఇలాంటి మీరు మా సంధ్యాల కుర్రాళ్ళకి చదువేం చెబుతారు?" అందులో సున్నితమైన హాస్యం!

"మహాతల్లీ" కొద్దిగా కోపంగా అన్నాడు "నీవెవరో నాకు తెలీదు. నువ్వు చెప్పవు. ఎందుకు మాటాడేదీ చెప్పవు."

"మాస్టారూ! ఎంతసేపు నిలబడతారు! చెయిర్లో కూర్చోండి. ఇప్పుడిప్పుడే ఎవరూ రారు లెండి. పైగా మీకు ఈ అవర్ లీజర్ - తర్వాత లంచ్ బ్రేక్. ఈవినింగ్ సెకండ్ అవర్ సెకండియర్స్‌కి డ్రామా క్లాసు - మీరు బాగా చెబుతారని పిల్లలు క్లాసు ఎగవేయరు."

"చూడండి! మీకు నా గురించి ఏమేం తెలుసు?"

"యువర్ బయోడాటా! హాబిట్స్ టేస్ట్స్ చెప్పనా? మీ కాసెట్స్‌లో బాలమురళిని బంధించారు. సుబ్బులక్ష్మితో అన్నమయ్య గీతాలాపన చేయించారు. మెహదీ హస్సేన్ గజల్స్- అబ్బా మ్యూజిక్ -డిస్కో సాంగ్స్- సంగీత, రాజేశ్వరరావు అదే రసాలూరు వారు గీతాలు - ఘంటసాల వారి కమనీయ కంఠం, బాలూ శివాష్టకం - జానకి త్యాగరాయ కీర్తనలు  ఇంకా చెప్పనా?"

"అమ్మాయ్" ఆయనేదో చెప్పబోయాడు.

"సవరించుకోండి, మాస్టారూ! నేను మీ స్టూడెంట్ ని కాదు. అఫ్‌కోర్స్, నాకు ఆ అదృష్టం లేదు. ఉంటే కథలే చెప్పేవారో, కామశాస్త్రమే నేర్పేవారో!

స్పష్టంగా వినిపించింది ఆయన పళ్ళు కొరకటం.

"మాస్టారూ - మీకు శాండోజు టాబ్లెట్స్ అక్కర్లేదని నాకు తెలుసు. మీ దంత పటిమ తెలిసిపోతోంది. చమత్కారానికి కోపగిస్తే ఎలా? మత్కృతి చమత్కృతి మతులైన మీ మతిని సమ్మతితో రసింపజేయాలి? నీరసింపజేస్తే ఎలా?" సన్నని నవ్వు. ఎండిపోయిన ఏటి పాయపై కొంకరిలో కురిసిన ప్రవాహం నెమ్మది నెమ్మదిగా వస్తోన్న ధ్వనిలాంటి నవ్వు.

ఆచార్యం మెండై గొంతులోకి వచ్చింది.

"అన్నట్లు మీరు ఫైలాలజీ చెబుతారా?"

"ఊఁ"

"నాకు కొన్ని శబ్దాల ఉత్పత్తి తెలియటం లేదు."

"ఉదాహరణకి ప్రేమ."

"ఏముంది?"

"నా పేరు కావాలా?"

"ఊఁ"

"అమ్మో! నో! అంత సులువుగా చెబుతానా. అయినా పరాయి అమ్మాయి పేరు కనుక్కోవాలని ఎందుకండి మీకు అంత కుతూహలం!

అతనికి గుండెలో కితకితలు పెట్టినట్టయింది. పూలలో కొడుతున్నట్టుగా ఉన్న ఆ సంభాషణని ఇంకాస్త పొడిగించాలనిపించింది.

"ఏమిటి వాగ్బంధమై పోయింది? 'మేడమ్' గుర్తుకొస్తున్నారా?"

"అఁ, ఆఁ" తడబడ్డాడు అర్ధాంగి ప్రసక్తిరాగానే.

"క్లాసులో పాఠం చెబుతుంటే మీకు భార్య గుర్తుకి వస్తుంది. లైబ్రరీలో తారాశశాంకమో, బిల్హణీయమో, అహల్యా సంక్రందనమో చదువుతూ ఉంటే మీకు మదిలో మెదిలేది మీ అర్ధాంగి. మీరు ఉత్తమ భర్తలు, ఏమండీ అలా అనొచ్చా! నేను తెలుగు చదువుకోలేదు."

"మీరేం చదివారు?"

"ఏరోనాటిక్స్ పిహెచ్.డి చేశాను."

"ఫారిన్ రిటర్న్."

"అవునండీ! ప్రతి స్త్రీకి అత్తారిల్లు ఫారినే కదా!" ఆ మాటల వెనుక మేఘం చాటున మెరుపులా కనిపించీ కన్పించని నవ్వు - తెరలు తెరలుగా వస్తోంది.

ఆమెను తను మాటలతో జయించలేననుకున్నాడు.

"ఇంకా మీ పేరు చెప్పారు కాదు."

"మాస్టారూ! మీకు ఆరుద్ర గళ్ళ నుడికట్టు శ్రీ శ్రీ పదబంధ ప్రహేళిక పూర్తి చేయ్యటం వచ్చు కదా! నా పేరు కనుక్కొందుకి క్లూస్ చెబుతాను. పట్టుకోండి."

"చెప్పండి."

"అబ్బ! ఆశ - తెలుగెమ్మే శాంస్క్రిట్ డిప్లొమా విశ్వనాథపై రిసెర్చ్ - క్లూ ఇస్తే ఆట్టే పట్టేయరూ. అయినా మీ అభిమాన కవిపేరులో తొలి అక్షరం నా పేరులో ఉంది సంఖ్య మళ్ళీ చెబుతాను. ఇదో క్లూ గుర్తుంచుకోండి."

"అంతకీ మీకు నాతో పనేమిటి?"

"చందమామతో మనకి చుట్టరికమూ? చల్ల గాలిలో బాంధవ్యమూ? పరిమళాలతో పరిచయమూ! అవంటే ఎందు కిష్టం? మీకు ఆవకాయలో పచ్చిమిర్చి నంజుకోవటం ఇష్టం- రోజా శేషేంద్ర శర్మగారి గేయాలో, కిన్నెరసాని పాటలో పాడుకోవటం ఇష్టం హాహా! కిన్నెరసానీ అంటూ మీ ఆవిడ చుట్టూ మీరు సూర్యుడి చుట్టూ తిరిగే భూగోళంలా....."

"ఏమండీ ఇవన్నీ మీకు ఎలా తెలుసు?"

"మీకు విశ్వనాథ 'వేయి పడగలు ఎన్ని రోజుల్లో రాసింది ఎలా తెలుసు? నాయని సాబ్రదుని ప్రణయ యాత్ర ఎలా రాసిందీ ఎలా తెలుసు? ప్రభాకర శాస్త్రిగారి మాస్టర్ యోగ గురించి ఎలా తెలుసు? ఇదీ అంతే! మనసుంటే మార్గం ఉండదా!

జలతరంగిణి శబ్దాల్లాగా మోగుతున్నాయి పదాలు. ఆ కంఠంలో ఎంత మాధుర్యం! పూలు జలజలా రాలినట్టు, మంచు చలచల్లగా సోనలై తీనలై వర్షించినట్టు, గంధం చిలకరించినట్లు....

"సర్ ఎవరయినా కాలేజీకి రింగ్ చేస్తోంటే 'మన ఎంగేజ్డు సౌండ్స్ విని తిట్టుకుంటారు. ఫోన్ పెట్టేస్తున్నాను. మళ్ళీ వీలయినప్పుడు ఫోన్ చేస్తాను."

"ఎప్పుడు?"

"ఎందుకండీ కంఠంలో ఆ ఉద్విగ్నత - అన్నట్టిది తద్ధిత రూపమేనా? ఏమో బాబూ! నేను తద్ధిత మాధురాలిని. నన్ను తద్ధిత మాధురాలిని చెయ్యండి- ఇంటికి వెళ్ళి నాగురించి కలలు కనకుండా కులపాలికా ప్రణయంలో మునిగిపోండీ.'

ఫోన్ కట్టయిన శబ్దం. ఉస్సురుమన్నాడు ఆచార్య.

✧ ✧ ✧

ఆ పూటంతా అదోలా గడిచిపోయింది. ఒక వినూత్నానుభవం పొందిన మనస్సా భావ పరిమళాన్ని దాచుకోలేకపోతోంది. కానీ ఈ అనుభవం ఇతర్లతో చెప్పుకునేదా? ఊహూ. మంత్రం కంటే రహస్యం - మధువు కంటే మధురం - మగువ కంటే తీయన-

ఇంటికి వచ్చేసరికి అర్ధాంగి లక్ష్మి ముభావంగా ఉంది.

ఆచార్యకూడా అదోలా ఉండిపోయాడు. కాఫీ ఇస్తే తాగేడు. టిఫిన్ వద్దన్నాడు. బయటికి వెళ్ళలేడు. ఇంట్లో ఉండలేడు. కూర్చోలేడు. నుంచోలేడు. ఏదయినా చదువుదా మనుకున్నాడు. తీస్తే చేతికి క్రీడాభిరామం వచ్చింది. నిట్టూర్పు గుండెలోంచి తన్నుకొచ్చింది. ఆ 'వయారి'ని ఆయన చూసి ఉంటే - అమ్మాయ్ బ్రతికి పోయావు నువ్వు - లేకపోతే నీ పై నూనాస్త్ర ప్రమదా అంటూ పద్యం చెప్పి 'ణిసి' ధాతువు అర్థాన్ని అడిగే వాడు కవి సార్వభౌముడు' అనుకున్నాడు.

చప్పున లైటు వెలిగింది.

"ఏమిటలా ఉన్నారు? చీకటిపడింది కూడా గమనించలేదు."

"ఆఁ ఆఁ"

"అనుష్ఠానం చేసుకుంటారా?"

"ఊఁ" అన్నాడు. అదీ ముగిసింది. చంద్రోదయం వెంటే చంద్రికా ధవళిమలా తదనంతరం భోజనమూ అయింది . వెన్నెల వేళ మలయ మారుతంలాగా 'మృగమదం'తో కూడిన తాంబూల సేవనం.

ఆలోచిస్తూ పడుకున్నాడు.

ఆలోచనలు కొండెక్కాయి. పాలమీగడలాటి తెల్లటి జరీచీరలో గగనాంగణంలో విరిసిన పారిజాత సుమంలా కొర్కెల హరివిల్లు - ఇల్లాలు - ఎదుట ప్రత్యక్షమై నిలిచింది.

దీపం కొండెక్కింది.

✧ ✧ ✧

ఒకటి, రెండు మూడు వారం రోజులు....

మళ్ళీ శుక్రవారం వచ్చింది. జ్ఞాపకాలు-మధుమాలికలు-కాళ్ళు ప్రిన్సిపాల్ గదివైపు నడిచాయి. ఆయన క్లాసుకి వెళ్ళుతున్నాడు.

'ఫోనొస్తుందా?' అనుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు.

మనస్సులో తహతహ. వారం రోజులు ఎదురు చూసిన విరహం ఏడు రోజుల నాడు సంగీత స్వరమేళలా వినిపించిన పదబంభరాలు-వీనుల్లో ధ్వనిస్తూ వలపు వీథుల్లో నినదిస్తూ, గుండెల్లో ప్రతిధ్వనిస్తూ-మనస్సు నినదిస్తూ-

తల విదుల్చుకున్నాడు.

అంతా కలలా ఉంది.

ఎవరా అమ్మాయి ?

తనని క్షుణ్ణంగా చదివినట్టు-తన సిరలల్లో ధమనుల్లో ప్రవహించే వలపు ప్రవాహాలని పరీక్షించినట్టు ఎంత చక్కగా మాట్లాడింది.

కలలో కనిపిస్తే అదో తరహా-ఇలలో ఎక్కడో తారసపడితే అదో విధం. ఇదలా కాదే! గుండె ఝల్లు మనేట్టు, కళ్ళు కలువలై పూచేట్టు, వలపు సెలయేరులై ప్రవహించేట్టు ఎన్నడూ ఎరుగని ఈ వింత అనుభూతి! ఏమిటిది? ఇన్నేళ్ళ జీవితంలో ఏనాడూ ఎరుగని కొత్త అనుభవం.

ఫోన్ రింగయింది.

చప్పున తీశాడు. గుండె దడ దడ మంటోంది.

"హలో!

"హలో! ఎవరు మీరు? ప్రిన్సిపాల్ లేరా?" దర్పం, అధికారం, ఠీవి ప్రకటించే

గొంతు.

"లేరండీ క్లాస్‌కి వెళ్ళారు. మీరెవరు?" మెల్లిగా ప్రశ్నించాడు.

"వన్ టవున్ పోలీస్ స్టేషన్ నుంచి. నేను పి.సి.వి. ప్రిన్సిపాల్ గారు. రాగానే రింగ్ చేయండి. ఎస్.పి.గారు మాట్లాడతారట.'

"అలాగే!" నీరసంగా ఫోన్ పెట్టేశాడు ఆచార్య.

క్షణాలు సెకనులై, సెకనులు నిమిషాలై, నిమిషాలు గంటలై, గంటలు రోజులై, రోజులు మాసాలై, మాసాలు సంవత్సరాలై, సంవత్సరాలు శతాబ్దాలై, శతాబ్దాలు యుగాలై పోతాయి. కానీ ఇదేమిటి ఇలా క్షణాలే యుగాలవుతున్నాయి-ఏనాడూ ఎరుగని అనుభవం.

ఫోన్ రింగయింది.

అతని కళ్ళలో ఆశ మెరిసింది. అంతలో నిరాశ. నీరసంగా తీశాడు.

"హలో!"

వూసర క్షేత్రంపై తొలకరి చినుకు! అదే స్వరం.... అదే తీయదనం....

"హలో!" ఉత్సాహం ఉరకలు వేసింది.

"వారం వారం వందన మస్తుతే!"

'ఎంతటి చమత్కారం' అనుకున్నాడు.

"బావున్నారా! విహాయస వీథుల్లో ఎగురుతున్నట్టున్నారు. అవునా! కృష్ణశాస్త్రి గుర్తు కొస్తున్నారా? నా కుగాదులు లేవు, నా కుషస్సులు లేవు."

"మీకు తెలుగు ఎంత బాగా పరిచయం?"

"కొట్టిన పిండి-ఎలానంటారా? సావాస దోషం-అవునూ-అక్కడ 'దోషం అన్నాడేమిటి, మళ్ళీ సుగుణోభవంతి అంటారు."

"మీరోసారి లిటరేచర్ క్లాసు తీసుకోండి."

"చెబుతారా? వింటారా?"

"చెప్పటమా! వింటేనే హాయిగా ఉంటుంది."

ఫక్కుమని నవ్విన శబ్దం పాలసంద్రంపై మీగడ తరకలు కదలాడినట్టు, మార్దంగికుని చేయి మృదంగంపై అలా అలా అలవోకగా కదలినట్టు...

"మీరు బాగా నవ్వుతారు."

"మీ కాంప్లిమెంట్‌కి థాంక్స్. నేను బాగా నవ్వుతాను. మాస్టారూ నేనూ బావుంటాను-అట. నేను నవ్వుతూ ఉంటే నా పలువరుస చాలా అందంగా కనిపిస్తుందని మా రజని అంటారు. కొందరు కొన్ని భంగిమల్లో బావుంటారుట! అలానే నేను నవ్వుతూ ఉంటే..."

"మీ రజని ధన్యుడు."

"థాంక్స్. రజనీ అంటే ఏమనుకున్నారు? వెన్నెల దొర-వలపు వసంతాల రేడు. రాగరక్తిను మూర్తీభవించిన వాడు."

ఆచార్య ఏమీ అనలేదు.

'మీకు నన్ను చూడాలనిపిస్తోందా!"

"ఊఁ. మీరెక్కడ నుంచి మాటాడుతున్నారు?"

"భూమ్మీదనుంచే. అంతరిక్షం నుంచి కాదు."

"మీ ఫోన్ నంబరు..."

"బావుంది. నవలలు చదివి మీకూ ఆడపిల్లల ఫోన్ నంబరు కనుక్కోవాలని ఆరాటంగా ఉందా?"

"సారీ"

"ఏమండీ, మీరు చదివిన చదువుకీ, చేస్తోన్న ఉద్యోగానికీ, మాటాడే తీరుకీ పొంతన లేదే. స్వస్థానవేష భాషాభినుతులుగా ఉండాలికదా-మీకు గుర్తులేదా ?'

"మీరు రసలుబ్ధులు."

"బ్రతికించారు. లుబ్ధులు అన్లేదు."

"మీ పేరు చెప్పనేలేదు."

"ఇంకో క్లూ ఇవ్వనా? దేశంలో నా పేరులోని ఒక అక్షరం ఉంది. ఇంకోమారు ఇంకో క్లూ."

"పోనీ, మిమ్మల్ని చూడాలంటే.."

"సకుటుంబంగా వస్తారా? టీకి పిలుస్తాను."

చప్పున జవాబివ్వలేదు.

"ఏం? మీ శ్రీమతి రారా! మీరు తీసుకు రారా?"

"అదేం కాదు."

"మీ ఆవిడ పేరు చెబుతారా?"

"భార్య పేరు చెప్పొచ్చా?" నవ్వుతూ అడిగాడు.

'సలక్షణంగా. ఆత్మనామం చెప్పుకోరాదన్నారు. గురువు పేరు చెప్పొచ్చు. ప్రతి భార్యా తన భర్తకి కొన్ని విషయాల్లో గురువు."

"శ్రీమతి శ్రీవిద్య.'

"మరో శ్రీశ్రీ అన్నమాట."

నవ్వేడు ఆచార్య ఆ చమత్కారానికి.

"ఎప్పుడొస్తారు మా ఇంటికి?"

'అడ్రస్ చెప్పండి!'

"ఎంత ఆశ-పేరు చెప్పలేదు. ఫోన్ నంబరివ్వలేదు. ఇంటి అడ్రసిస్తానా? కానీ ఒక పన్లా. మీరు నను చూడాలనుకుంటే రేపు కాలేజీ వదలే వేళకి నేను కల్పన సెంటర్లో నుంచుంటాను. నన్ను గుర్తించగలిగితే మీకు స్వీట్, హాట్, నెస్కాఫీ, సరేనా?"

ఆచార్య ఆలోచనలో పడ్డాడు. ముక్కూ ముఖం తెలియని మనిషిని గుర్తించటం ఎలా? ఎలా ఉంటుంది? ఏ చీర కట్టుకుంటుంది?

"హలో...ఆలోచిస్తున్నారా? కష్టపడాలండీ వూరకేనా? నాలాంటి 'అమ్మా'యితో పరిచయం, పార్టీ, ఫ్రెండ్‌షిప్ వగయిరా వగయిరా? అయినా నా టార్గెట్‌గా మిమ్మల్నే ఎందుకెన్నుకున్నానో తెలుసా?"

"వూహూఁ."

"మీరయితే నా పదమురందాన్ని ఆస్వాదించగలరు. మీలో చమత్కారం ఉంది. సౌందర్యోపాసన ఉంది. ర-సి-కత ఉంది. యామ్ ఐ కరెక్ట్."

"కృతజ్ఞుడిని."

"పొరబడ్డారు. ధన్యోస్మి అనాలి. తెలీదా?"

ఆమె కొంటెగా నవ్వుతూ ఫోన్ పెట్టేసింది. అయినా ప్రాణం లేని తీగలు ఇంకా ఆ ధ్వని తరంగాల్ని మోసుకొస్తున్నట్టుగానే ఉంది. ఫోన్స్ ఎంత మంచివి. అన్నట్టు 'ఫోన్' కనిపెట్టిందెవరో! అతనికి థాంక్స్ చెప్పుకోవాలి. ఈ ఫోన్స్ ఎప్పుడొచ్చాయి ఇండియాకి-ముఖ్యంగా సంధ్యాలకి కుతూహలంతో ఎక్స్చేంజికి రింగ్ చేశాడు ఆచార్య.

✧ ✧ ✧

సాయంకాలం ఆరింటికి వెళ్ళి కల్పన సెంటర్లో నుంచున్నాడు ఆచార్య. కళాశాల నుంచి తిరిగి ఇళ్ళకు వెళ్ళుతున్న విద్యార్థినీ విద్యార్థులు, సినిమా హాళ్ళని 'విజిట్' చెయ్యటానికి వెళ్ళే విద్యార్థులు, థియేటర్లని 'పావనం' చెయ్యడానికి వెళ్ళే కళోపాసకులు అంతా హడావిడిగా వెళ్ళుతున్నారు. రన్నింగ్ రేస్‌లోలాగా ఎక్కడికి వెళతారు ఈ జనం అనుకున్నాడు ఆచార్య. అంతా తొందర-తొందర- ఇంటికి వెళ్ళేందుకు తొందర. ఇంటినుంచి బజారుకి బయటపడటానికి తొందర-షాపింగ్‌కి తొందర- షాపింగ్‌నుంచి తిరిగి వెళ్ళటానికి తొందర-సినిమాకి తొందర-అక్కడినుంచి ఎప్పుడెప్పుడు పిక్చరై పోతుందా, ఇంటికి వెళదామా అని తొందర? పరుగో-పరుగు-ఏం మనుషులు వీళ్ళు? ఈ వేగం బి.పి. మనుషుల ఆరోగ్యాన్ని హరించినట్లు హరించి వేస్తుందని తెలీదా?

"హలో!"

ఉలికిపడ్డాడు ఆచార్య.

"ఇక్కడ నుంచున్నారేం? షాపింగ్‌కి వచ్చారా?"

"ఆఁ ఆహాఁ ఉఁ వూహూఁ" తడబడ్డాడు ఆచార్య.

పకపకా నవ్వాడు ఆ వ్యక్తి. అతను ఆచార్య వాళ్ళ సొంతూరు మనిషి. ఏదో పనిమీద

నంద్యాల వచ్చాడు. "నువ్వేం మారలేదు ఆచార్లూ! ఏమిటా తడబాటు! ఏదైనా పనిమీద ఉన్నావా? తొందరేం లేదు. నుంచో నే వెళ్ళి వస్తాలే!" అని వెళ్ళిపోయాడు.

"బతికిపోయాను" అనుకున్నాడు ఆచార్య.

నిరీక్షణలో మరో పావుగంట గడిచి పోయింది.

ఎలా కనుక్కోవాలి? గొంతుకకి రూపం ఉంటే గుర్తు పట్టెయ్యొచ్చు! అయినా మాటాడితే కనుక్కోవచ్చు! ఏం చీర కట్టుకుని వస్తుందో! ఏ రంగు రవికో! అసలు ఎలా ఉంటుంది? మామూలుగా ఉంటుందో! ఫ్యాషన్ పెరేడ్‌కి వెళ్ళినట్టుగా వస్తుందో! ఎలా కనుక్కోవడం? ఛ! ఛ! గుర్తు పట్టేందుకి ఒక గుర్తయినా అడగలేదు – ప్చ! అన్నీ ఆఫ్టర్ థాట్స్.

తనని తను నిందించుకున్నాడు ఆచార్య.

✧ ✧ ✧

"అలా ఉన్నారేం?"

వేల మైళ్ళు నడిచి వచ్చిన వ్యక్తి డీలా పడిపోయినట్టుగా ఉన్న భర్తని చూసి ప్రశ్నించింది.

"ఏం లేదు." ముభావంగా అన్నాడు.

"ఎందుకు లేదు? ఎక్కడో కాళ్ళపై నుంచుని నుంచుని వచ్చినట్టుగా అలిసి పోయారు!"

ఉలికిపడ్డాడు. చప్పున భార్యవైపు చూశాడు. కానీ ముఖంలో ఏ భావమూ ప్రకటితం కాలేదు. తనే గాభరా పడుతున్నానా అనుకున్నాడు. జవాబు ఇవ్వలేదు.

"స్నానం చేయండి. వేడి వేడి నీళ్ళతో స్నానం చేస్తే అలసట పోతుంది. తరవాత వేడి వేడి అన్నం తిందురు కానీ. ఆ తరవాత..."

వేడి వేడి ఆలోచనలతో సతమతమవుతున్నాడు ఆచార్య. అతనికి సిగ్గుగా ఉంది. కొంచెం భయంగానూ ఉంది. ఏనాడూ ఎరగని అనుభవం! భార్య ముందు బయట పడిపోతానేమో అనిపించింది! ఎందుకొచ్చిన గొడవ! ఆ టెలిఫోన్ సుందరిని చూడకపోతేనేం! ఇంట్లో ఉన్న నిరాభరణ సుందరి సౌందర్యోపాసన చాలదూ!

ఛ! ఛ! ఎంత థ్రిల్లింగ్‌గా ఉంది ఆ గొంతు. కంఠమాధుర్యమే అంత కమ్మగా ఉంటే మనిషెంత అందంగా ఉంటుందో! కొంపదీసి వ్యతిరేకం అవదు కదా! ఆ వూహ వచ్చినందుకు తనని తాను తిట్టుకున్నాడు ఆచార్య.

ఆ రాత్రి వలపు వసంతాలు వర్షించినా మనస్సు మాత్రం ఆ చంద్రోదయ చకోరిదయ కోసం ఆరాటపడుతూనే ఉంది.

✧ ✧ ✧

రెండు రోజులు గడిచిపోయాయి. రెండురోజులా? ఊహుఁ. రెండు యుగాలు

అంతే! ఇంట్లో విశ్రాంతి లేదు. కాలేజీలో ప్రశాంతి లేదు. క్లాసులో విశ్రాంతి లేదు. మనస్సులో శాంతి లేదు. క్షణక్షణం తపన ఉద్వేగం ఆలోచన ఆరాటం.

నిరాశ పరిచినందుకు కోపం. ఓడిపోయినందుకు సిగ్గు. కొత్తగా చిక్కుకున్న ఈ వలకి భయం. మళ్ళీ ఫోన్ చెయ్యలేదని కోపంతో కూడిన ఆరాటం!

మళ్ళీ మనస్సులో ఒక ఔదార్యం. ఆమె ఎవరో ఏ స్థితిలో ఉందో, ఏ పరిస్థితులలో ఉందో! ఆ మాటల్లో అంత ఆత్మీయత, అంత ఆరాటం అంత ప్రేమ, అంత చిలిపితనం చిగిర్చిన ఆ అమ్మాయి అమ్మాయేనా?

"ఏమిటి, ఆచార్యా! ఆలోచనలో పడ్డావ్?" ఫిజిక్స్ లెక్చరర్ అడిగాడు.

"ఆఁ." ఖంగుతిన్నట్టుగా చూశాడు.

"ఏం లేదు. ఆషాఢ మాసంలో మేఘ సందేశం పంపబోయే మానవుడిలా ఉన్నావ్? పెళ్ళైన ఇన్నేళ్ళకి మనకి విరహమేమిటి?"

"అబ్బే! అదేం లేదు."

"ఎందుకు లేదులే! ఏదో కథ ఉంది! చెప్పరాదూ! కొత్తగా ప్రేమలో పడ్డావా ఏమిటి?

"చ! చ!"

"కొయ్యకు, ఆచార్యా! నేను నాడి పట్టేస్తాను. చూడు ఎక్కడో చిక్కుకున్నట్టున్న ఆ చూపులు ఎక్కడో పారేసుకున్న మనసు కోసం తపన పడుతున్నట్టు ఆ ఆలోచనలు, నిస్పృహకి లోనైనట్లుగా ఉన్న ఆ దిగులు అవునా! ప్రేమలో పడ్డావు కదూ!"

"నాన్సెన్స్ నాకేమిటి? ప్రేమేమిటి? పెళ్ళయింది. హాయిగా భార్యతో రోజొక పండుగ్గా కాపురం చేస్తున్నాను. నాకు విరహ మేమిటి? దిగులేమిటి?" దబాయించాడు ఆచార్య.

ఫక్కున నవ్వాడు ఫిజిక్స్ లెక్చరర్. అంతలో జూఆలజీ మేథమేటిక్స్ లెక్చరర్స్ రావటంతో ఆ కబుర్లు ఆగిపోయాయి. ఆచార్య తెరిపిన పడ్డట్టుగా ఫీలయ్యాడు.

అంతలో క్లాసుందని వచ్చారు స్టూడెంట్స్.

"నా మనసేం బావులేదు అనబోయి "హెల్తు అదోలా ఉందోయ్! రెస్టు తీసుకుంటాను. ఇంకెవరినయినా క్లాసు తీసుకోమనండి!" అన్నాడు. లీజరవరనుకుంటూ వెళ్ళారు స్టూడెంట్స్.

తిరిగి స్టాఫ్‌రూంలో గందరగోళం! మనస్సు కెక్కని మాటలు పేపరు చేతికి తీసుకున్నాడు. వార్తలు మదికెక్కటం లేదు.

"సర్! మీకు ఫోనొచ్చింది."

చప్పున కుర్చీలోంచి లేచాడు ఆత్రంగా. అంతలో తన తొందరపాటు ఎవరయినా గమనించారేమో అన్నట్టు చూశాడు. లక్కీ! ఎవరూ పట్టించుకోవడం లేదు.

"ఏమండీ రోజూ ఫోనొస్తుందేమిటి? ఎవరా అమ్మాయి బంధువులట కదా?" అడిగారు ప్రిన్సిపాల్.

"ఎస్, సర్! అంటూ ఫోనందుకున్నాడు.

"హలో! నన్ను గుర్తించలేకపోయారే! గణేష్‌లోకి వెళ్ళి నేను స్వీట్ తింటూ, కారా తీసుకుంటూ కాఫీ సేవిస్తూ మిమ్మల్నే గమనించాను. హోటల్లో అందరి చూపులూ నా మీదే! ఎవరూ తోడు లేకుండా ఒక్కర్తిగా ఇరవయ్యేళ్ళ అమ్మాయి హోటల్‌కి వస్తే ఏ విజయవాడో. హైద్రాబాద్, వైజాగో అయితే ఫరవాలేదు కానీ ఇక్కడ వింతగానే ఉంటుంది. అవునూ! నన్నెలా మిస్సయ్యారు?"

ప్రిన్సిపాల్ ఇటే చూస్తున్నాడు. ఆచార్య సమాధానం ఇవ్వలేదు.

"క్లాసు తీసుకోలేదేం! ఒంట్లో బావులేదా? అన్నీ దొంగమాటలు. మనస్సు బావులేదు కదూ!" మీ లేడీ శ్రీశ్రీగారు చీవాట్లేశారా? కొంపదీసి మన టెలిఫోనియం గురించి చెప్పారా? అవునండీ- ఈ శబ్దం-టెలిఫోనీయం కరెక్టేనా?"

"చూడండి. నాకు హెల్తు బాగాలేదు. సెలవు పెడుతున్నాను రెండు రోజులు. మీరు మా ఇంటికి రండి- ఇల్లు కనుక్కోవడం సులువే!"

"అరరె" అంది. ఆమె కంఠంలో ఆశ్చర్యం, సానుభూతి సమపాళ్ళలో.

అంతలో ప్రిన్సిపాల్ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

పుంజుకున్నాడు ఆచార్య. "ఏమిటి మీ ఉద్దేశం? నన్ను ఇలా ఆట పట్టిస్తున్నారెందుకు? అయామ్ మేరీడ్. యూనో ఇట్ - నా వెంట పడ్డావేమిటి?"

"ఆచార్యా! నాలిక్కొట్టేసుకోండి" దబాయించింది. "ఆడపిల్ల కదా అని నోరు పారేసుకుంటే నేను సుప్రీంకోర్టుకి వెళ్తాను."

"సుప్రీంకోర్టుకా?"

"ఆహా! కేసు మీ ఆవిడకి రెఫర్ చేస్తాను-మగాడికి-పెళ్ళయిన మగాడికి భార్య సుప్రీం కదా!"

నవ్వు వచ్చింది. ఫక్కున నవ్వాడు.

"అబ్బ! ఇప్పటికి టెన్షన్ తగ్గిందన్న మాట. అయితే నాపై బాగా కోపం వచ్చిందా? కనిపిస్తే చివాట్లా? కమ్మని కబుర్లా? పైనా? ఏమిటి చెప్పండి? కులాసాగా నవ్వుతూ అంది" మళ్ళీ కార్తీక జ్యోత్స్నకే ఉప్పొంగే నదిలాటి నవ్వు.

"చూడండి, మిస్-అదృశ్యం-డోంట్ ప్లే విత్ మీ."

"ఆచార్యా! ఇది తెలుగుదేశం. తమరు తెలుగు వారు. తమ మాతృభాష తెలుగు. పైగా తెలుగు ఉపన్యాసకులు తమరు. మన అధికారభాష తెలుగు. ఇన్ని నియమాలున్నా, విశేషాలున్నా మీరు ఆంగ్లం వాడుతున్నారు-నేను అధికార భాషా సంఘం అధ్యక్షుల వారికి ఫిర్యాదు చేస్తాను."

"అవశ్యం, అట్లే కానిండు."

"ఏ అట్లు? పెసరా? మినపా?"

ఆ చిలిపితనమే అతన్నాకర్షిస్తూంది.

"ఒక శుభవార్త చెప్పనా?"

"సద్దంటే అగుతానా? పంచతంత్రం-హితోపదేశం...."

"పూ(. నా విషయం బాగా తెలిసిందన్న మాట. అలా రండి దారికి. నేను రేపు మీ ఇంటికి వస్తున్నాను. ఏ సమయంలో రమ్మంటారో చెప్పండి."

ఉద్వేగపూరితమైన నిట్టూర్పు.

"ప్రాణాయామం చేస్తున్నారా?"

"రేపు మధ్యాహ్నం మూడింటికి అటూ ఇటూ."

"సాయంకాలమూ, సరే" సవరించింది. 'మీకు క్లాసైపోయి ఇంటికి వస్తారా? ఆ సమయానికి మీకు కాఫీ రెడీగా ఉండాలే! సిస్టర్‌కి చెబుతారా నేను వస్తున్నానని? ఆమె ఇంట్లో ఉంటే నాతో ఎలా మాట్లాడతారు?"

కొరకుడు పడని సమస్య.

"పోనీ మీ శ్రీమతిని మ్యాట్నీకి పంపండి. 'శుభలేఖ' చూడాలంటూంది కదా!"

"అది ఇద్దరం చూడాలి!"

"హతోస్మి! మన మిద్దరమూ? రేపు సాయంకాలానికల్లా తెల్ల గోడలన్నీ మన పేర్లతో అలంకరించబడతాయి. నాకేం ఫర్లేదు. నేనెవరో ఎవరికీ బాగా తెలియదు. మీకే చిక్కు. ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళవలసిందే.

"పూహూ(. మే మిద్దరం."

"అలా చెప్పండి. అయితే ముందు ఆమెనోసారి చూడమనండి. ఎలాగూ తను రెండుసార్లు చూడాలంది కదా!"

"నీకు మా ఇంట్లో, కుటుంబంలో విషయాలన్నీ తెలుసే!"

'ఆహా(. చెప్పానుగా! దివ్య దృష్టి ఉందని."

"రేపెందుకు- ఈ రోజే రావచ్చుగా!"

"ఆమెని ఈవెనింగ్ షోకి తయారు చేస్తారా?"

"ఆ(!"

"అలా అయితే థాంక్స్." ఫోన్ పెట్టేసింది.

ఆచార్యలో ఉద్వేగం ఒక స్థితికి వచ్చింది. ఈ దాగుడు మూతలు ఈనాటితో సమాప్తం-కానీ శ్రీవిద్యని సినిమాకి పంపడమెలా?

అంతలో ఫోన్ మళ్ళీ రింగయింది.

ఇంకా ప్రిన్సిపల్‌గారు రాకపోవటంతో తనే ఫోన్ తీశాడు.

"సర్! ఆచార్యగారిని పిలుస్తారా!" ఫోన్లో కంఠం అతి నెమ్మదిగా-ఒక కులస్త్రీ పరువుగా మర్యాదగా సంసారం చేసుకునే ఇల్లాలు పిలిచే కంఠంతో పిలిచిందామె.

"శ్రీ! నేను" అన్నాడు ఆశ్చర్యానందాలు నిండగా ఆచార్య. "ఫోన్ చేస్తున్నావేమిటి విశేషం?!"

"ఏమండీ! ఒక చిన్న కోరిక. నేను ఫస్ట్ షో శుభలేఖకి వెళ్ళివస్తాను. మన ఓనరుగారి భార్య పోరు పెడుతున్నారు. ఆయన వూరిలో లేరు. ఆయన రాకముందే చూడాలట. ఇంటికి తాళం వేసి వెళతాం. మీరు త్వరగా వస్తారా? ఆలస్యమై చీకటి పడ్డాక వస్తామంటే కీ గూట్లో పెట్టి వెళతాను."

ఎంతో ఆనందపడ్డాడు ఆచార్య. కాగల కార్యం గంధర్వులే తీర్చారు. దిగుల్లేదు. ఇల్లంతా ఖాళీ-ఫ్రీ. ఆమెతో బాగా మాటాడవచ్చు. లేకపోతే భార్య ఉంటే ఎంతయినా స్వేచ్ఛ ఉండదు. 'అలాగే-నీ ఇష్టం. నేను నాలుగున్నరకే ఇంటికి వస్తాను" అన్నాడు.

"థాంక్స్ చెప్పింది శ్రీవిద్య. ఫోన్ పెట్టేసింది.

"ఏమిటయ్యా ఆచార్యా! ఫోన్‌లో అలా గంటలు గంటలు మాట్లాడేస్తున్నావ్? ప్రిన్సిపాల్ గారు లోపలికొస్తూ అడిగారు.

'నథింగ్, సర్! మా ఆవిడ మళ్ళీ ఫోన్ చేసింది ఇప్పుడు."

"ఇంటికి వెళ్ళాలా? క్లాసు లేదా?"

నసిగాడు ఆచార్య.

"సరె-సరె!"

"థాంక్యూ! థాంక్యూ! వెళ్ళిపోయాడు ఆచార్య.

✧ ✧ ✧

శ్రీవిద్య అయిదింటికే వెళ్ళిపోయింది. ఆచార్యకి కాలు నిలవటం లేదు. ఇంట్లోకి, బయటకి తిరుగుతున్నాడు. పదే పదే చేతికున్న ఎలక్ట్రానిక్ వాచీ చూసుకుంటున్నాడు. చ! కాలం ఒక్కో సెకనుగా నడుస్తుందేమిటి?

ఆరు! చీకటి పడసాగింది.

ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూడసాగాడు. చీకట్లోనే కాంపౌండ్ వైపు చూస్తూ పచార్లు చేస్తున్నాడు.

"నమస్తే!" ఆరున్నరకి ఆరున్నర శ్రుతిలో పంచమ స్వరంలో కుహూ కుహూ అన్నట్టుగా వినిపించింది ఇంట్లోంచి-

ఉలిక్కిపడ్డాడు. చప్పున లోపలికి వచ్చాడు. లైటు వెలిగించబోయాడు.

"ఆగండి! లైటొద్దు. ఇలానే బావుంది. నేను పెరటిగుండా వచ్చాను. అక్కయ్యగారు తలుపులు వేయలేదు. అదృష్టవశాత్తూ నేనైంది. అదే దొంగ అయితే వెండి గిన్నెలు, వెండి కంచాలు, చెంబులు గోవిందా కదా! జాగ్రత్తగా ఉండాలి టన్నున్లనో....

"కృతజ్ఞుడిని"

"నేను వచ్చింది ఎవరూ చూడలేదు. తిరిగి అలాగే వెళతాను" అదే మధురస కంఠం – వీణ మోగినట్టు, సితారా పలికినట్టు.

ఒక్కసారిగా అతనిలో ఉద్వేగం చప్పున గడపదాటి ఆమె ఉన్న చోటికి వెళ్ళాడు.

"ఆగండి! గాభరాగా అంది.

"ప్లీజు! కాదనకండి. ఫోన్లో మీ స్వరం విన్నాను. ముగ్ధుడినయ్యాను. ఏనాడూ దేనికీ చలించని నేను చలించాను. ముఖ్యంగా మీ చమత్కారం మీ సరస సంభాషణ నన్ను లోబరుచుకున్నాయి.

"అయితే..." కఠినంగా వినిపించింది! "మీకు పెళ్ళయింది. భార్య ఉంది. నేను కన్యనే. అయితేనేం? మీరు ఆమెని వదిలేసి నన్ను చేసుకుంటారా? ఈ థ్రిల్ - ఈ ఆనందం- ఈ చమత్కారం అన్నీ ఈ ఒక్క పూటకి చాలా? శాశ్వతంగా అక్కర్లేదా?"

చప్పున ఆగిపోయాడతను.

"విడాకులు ఛ! ఛ! శ్రీవిద్యకి విడాకులా? తామరాకుపై నీటి బొట్టులాంటి ఈ అమ్మాయి మాటల కోసం శ్రీవిద్యని వదులుకుంటాడా? శ్రీవిద్య చదువు, సంస్కారం, ప్రేమ, సరాగం అన్నీ మూర్తీభవించిన స్త్రీమూర్తి. ఈమె మాటల్లో గమ్మత్తు ఉంది. అంత మాత్రాన ఈ ఒయాసిస్సు వెంటపడి ఆ చెలిమి చెలమని వదులుకుంటాడా? ఊహూఁ.

"ఆలోచనలో పడ్డారేం?

"మీరు వెళ్ళిరండి!" ఆ కంఠంలో బొంగురుతనం. ఎద సన్నగా చేస్తున్న రొదకి ప్రతిధ్వని.

"అంతేనా మీ ప్రేమ. ఇంతకు ముందు ఆవేశం."

"నన్ను మన్నించు అజ్ఞాత మిత్రమా! నా కళ్ళు తెరిపిన పడ్డాయి. మెరుపు తీగ వెంట పరుగెత్తే బదులు చిన్న దీపమైనా చాలు."

"నన్ను చూడాలని లేదా ఇప్పుడు?

"ఊహూఁ. నీ స్వరంతో నేను భావనలో కట్టుకున్న రూపురేఖలు చాలు. అవే ఉండనీ."

"ఫోన్లో మాట్లాడరా?"

జవాబు లేదు.

"అలిగారా?"

"నన్ను నేను తెలుసుకున్నాను."

"వేదాంతులయ్యారా?"

"ఇంకా ఎందుకీ జిజ్ఞాస? నువ్వు వెళ్ళిరా."

"సంబోధన మారిపోయిందే?" ఎద్దేవాగా అంది.

"క్షమించండి. వెళ్ళిరండి."

"వెళ్ళిరానా? మళ్ళీ కొంటెతనం ఆ గొంతులో."

"ఊహూఁ. వెళ్ళిపోండి!"

"ఆదర్శ పురుషమూర్తి! నమస్కారం అడుగుల చప్పుడు.

అంతలో లైటు చప్పున వెలిగింది. అంతదాకా చీకటికి అలవాటుపడిన కళ్ళు చికిలింత అయ్యాయి. అదెంతసేపు! సగం క్షణంలో సగం!

"శ్రీ... ఎదురుగా చిరునవ్వు నవ్వుతూ నుంచున్న భార్యని చూసి ఆశ్చర్యంగా "నువ్వెప్పుడొచ్చావు? చీకట్లో లైటు వేసింది నువ్వేనా? సినిమాకి వెళ్ళలేదా? అన్నాడు.

ఆమె నవ్వుతూనే ఉంది. అతను గాభరాగా ఆమె వెనుకగా చూశాడు. 'ఆమె ఎక్కడుంది?'

"ఆచార్య! నవ్వుతూ పిలిచింది శ్రీవిద్య.

ఉలిక్కిపడ్డాడు ఆమె పిలుపుకి. అదే కంఠం! అదే పిలుపు.

మళ్ళీ పిలిచింది. సందేహం లేదు. శ్రీవిద్య! చప్పున దగ్గరికి వెళ్ళాడు.

✧ ✧ ✧

"మీరన్నట్లుగా జీవితంలో థ్రిల్ ఉండాలి! నేనూ సాహిత్యం చదువుకున్నాను. కానీ మీరు నన్ను గుర్తించడం లేదు. మీకు నన్ను నేను తెలియజేసుకోవడం ఎలా? అందుకే ఆలోచించి ఇంటి వాళ్ళ ఫోన్‌తో మీతో తమాషా ప్రారంభించాను. ఎలాగైతేనేం, ఎవరికి వాళ్ళం తృప్తిపడ్డాం."

భార్య ఎదురు రొమ్ములో తలదాచుకున్నాడు ఆచార్య. అతని కింకా సిగ్గుగానే ఉంది.

"రసికత నిరసించదగింది కాదు. అది సంస్కృతికి గుర్తు! జాతి జీవనానికి లక్షణం. మనిషి ఔన్నత్యానికి చిహ్నం."

"పాలించు మహారాణి!" క్లాసు తీసుకోవద్దు.

"లిటరేచర్"

"కామశాస్త్రం చెబుతావా?"

అతని నోరు చప్పున మూసింది-ఆ పెదాలని అలాగే హత్తుకున్నాడు. ఆచార్య పదబంభరాలు మనోపద్మం చుట్టూ తిరుగుతున్నాయి ప్రేమ వేదనాదంతో.

● ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 13-7-1983 ●